# రంగులు

టి. రామాచారి

**హైదరాబాద్** విమానాశ్రయంలో విమానం దిగుతూనే, నరేన్ తన ఎయిర్ బేగ్ తీసుకుని లేవబోతూ అక్కడేమయినా మరిచానేమోనని సీటు కిందికి తొంగి చూచాడు. ముందు వరసల వెనక నున్న ఒక సీటు కింద కవరొకటి కనిపించింది. దాన్ని తీసుకుని ఎవరిదో ఇదనుకుంటూ వెయిటింగ్ హాల్లోకి నడిచాడు. సిగరెట్ వెలిగించి చుట్టూ ఒకసారి చూశాడు. అదొక విశాలమైన హాలు. అందులో జనం అక్కడక్కడా చిన్న చిన్న గుంపులుగా నిల్చుని మాటాడు కుంటున్నారు. ఆ గుంపుల్నీ, అందులోని అమ్మాయిల అందాల్నీ చూస్తూ లగేజీ రాకకోసం ఎదురుచూట్టం మొదలెట్టాడు.

అక్కడున్న హేండీ క్రాఫ్ట్ కౌంటరు ముందు కొందరమ్మాయిలు చెక్క బొమ్మల్ని చూస్తూ నిల్చునుంటే, ఆ పక్కనే ఉన్న పుస్తకాల షాపు ముందు నిల్చున్న బాబ్డ్ హేర్ అమ్మాయిలు—చేజ్, అలిస్టేర్ మేక్లీన్ నవలల్ని తిరగేస్తూ, వాటి మీదున్న అర్ధనగ్న స్త్రీల రంగుల హావ భావాల్ని చూచి నవ్వుకుంటున్నారు.

ఇంతలో లాగేజీల్ని మోసుకొచ్చిన మోటార్ కోచ్ పోర్టికలో ఆగింది. నరేన్ తన లాగేజీని తీసు కుంటూంటే వెనక 'టక్ టక్' శబ్దం వినిపించింది. తిరిగి చూస్తే హై హీల్స్ మీద ఒక గులాబీరంగు చీర నడిచొస్తోంది. ఒంటి బుజం మీద నిలువ నంటోన్న కొంగు, స్లీవ్‌లెస్ జాకెట్, నునుదేరిన తెల్లటి భుజాలు, వీపుకి అతుక్కు పోయిన జాకెట్లోంచి కన్పిస్తూన్న బ్రాసెరీ — చూచి 'బ్యూటీ!' అనుకున్నాడు.

హోటల్ చేరుకున్న నరేన్—స్నానంచేసి బట్టలు వేసుకుంటూంటే, ఆ గదిలోని నిశ్శబ్ద వాతావర ణంలో అతనికి తన ఒంటరితనం ఎత్తి చూపించి నట్టు జ్ఞాపక మొచ్చింది. లంచికి వెడదామని బాగ్ లోంచి పర్సు తీస్తూంటే ఇంత క్రితం విమా నంలో దొరికిన కవరు కనిపించింది. దాన్ని ఇటు అటు తిప్పి, ఇది ఎవరిదై ఉంటుందాని ఆలో చిస్తూ, దాన్ని తను చదవాలా, వద్దాని అనుకుంటూనే చదవటం మొదలెట్టాడు. తెలుపు, గులాబీ కాగితం మడతలు విప్పుతూంటే కమ్మటి సెంటు వాసన వచ్చింది. ముత్యాల వరసల్లాంటి దస్తూరీతో ముచ్చ టగా ఉందా ఉత్తరం!

"డియర్ నాథ్!

చాలా రోజుల తర్వాత ఈ ఉత్తరం రాస్తున్నా. ఒక వేళ నా కేదయినా అయితే నువ్వూ, నీ ప్రేయసీ రోడ్డున పడి అడుక్కు తినకుండా దీంతోపాటు కొంత డబ్బు పంపుతున్నా. ఈ డబ్బును తప్పనిసరి అయినప్పుడే ఖర్చు చెయ్యి. దీనికోసం నేను ఎంత కష్టపడిందీ నీ కర్థంగాదు. ఈ డబ్బుకోసం జీవి తంలో నేను ఎన్నింటితో రాజీ పడ్డానో నీకు తెలీదు. నీవూ ఒక నాలుగు రాళ్ళు సంపాదించిన నాడు డబ్బు విలువ నీ కర్థమవుతుంది. అంతవరకూ నే నిలా ఎన్ని చెప్పినా ఏం ప్రయోజనం? ఇప్పుడు నీ క్కావల సింది నీ త్రాగుడూ, నీ ప్రేయసి!

ఒక ముఖ్య విషయం. నీవు చేసిన మన విడాకుల ప్రస్తావన గూర్చి బాగా ఆలోచించాను. కాని, దాని అవసరం ఇప్పుడేమీ లేదు. ఎందుకో ముందు ముందు నీకే తెలుస్తుంది.

ఆఖరి మాట: నీ ప్రేయసిని నువ్విప్పుడు పెళ్ళా డినా నా కెలాంటి అభ్యంతరం లేదు.

—రతి."

ఉత్తరంతోపాటు క్రాస్‌చేసిన పాతికవేల రూపా యల చెక్కుంది! ఎవ రీ రతి? ఎవరైనా, చిత్రమైన వ్యక్తిలా ఉందే? తన భర్త ఇంకో వన్నెలాడితో కులుకుతూంటే, ఈవిడ వాళ్ళకి డబ్బు పంపడ మేమిటి? ఈ కాలంలోనూ ఇలాంటి స్త్రీలుం టారా? ఏమో! అయోమయంగా ఉందతనికి. ఇలా ఆలోచిస్తున్న అతని కడుపు గురగురలాడింది. అతనా ఉత్తరాన్ని బాగ్‌లోనే పడేసి డైనింగ్ హాల్లోకి నడిచాడు. అక్కడి ఖరీదయిన వాతావరణంలో పెది మలు నొవ్వకుండా పురుషులు ఏవో మాట లంటూంటే—స్లీవ్‌లెస్ జాకెట్లు వేసుకున్న స్త్రీలు విలాసంగా వెంట్రుకల్ని వూగిస్తూ లిప్‌స్టిక్ పెదాలొత్తి నవ్వుతున్నారు. ఈ టెక్నికలర్ శృంగార విన్యాసాల్ని చూస్తూ నరేన్ సూప్ తాగుతూంటే, పక్కన సిల్కుబట్టల రాపిడితోపాటు సెంటు వాసన వచ్చింది. అప్పటికే ఆ హాలు సువాసనల్తో నిండి ఉన్నా, ఈ సెంటు అతన్ని ఆకర్షించింది. తిరిగిచూస్తే ఇందాక ఎయిర్‌పోర్ట్‌లో కనిపించి నామె, పక్కనే ఉన్న బల్ల ముందు కూచుని బేరర్కి ఆర్డరిస్తోంది.

నరేన్ ఒక పక్క అన్నం తింటూనే, మరోపక్క కోరచూపుల్తో ఆమె అందాన్ని ఆరాధిస్తున్నాడు. ఆమె వేసుకున్న నాలు గంగుళాల వెడల్పున్న జాకె ట్లోంచి తెల్లటి ఆమె శరీర ఛాయ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సూప్ తాగటానికి ఆమె బల్ల మీదకు వంగినప్పుడు ఆమె లోకట్ జాకెట్‌లోంచి బయటికి ఉబుకుకొస్తున్న స్తనాల అంచులు, ఒకదాని కొకటి రాచుకొని లేవి కోరికల్ని అతనిలో రేపుతున్నాయి. అప్పుడప్పుడూ తినటం మాని అటే చూస్తున్న అతని చిలిపి చేష్టల్ని ఆమె కనిపెట్టినా, నిర్లక్ష్యంగా 'ఊ. నువ్వెంతసే' మ్మన్నట్టు చూచి తినటం సాగిస్తోంది. ఆమె ఈ బింకానికి అతని మగసిరి బుసకొట్టింది. మగాళ్ళంటే ఈమె కింత నిర్ల క్ష్యమా? అనిపించింది. తినటం ముగించి వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ, ఎదుటి అద్దంలో తనను తను చూసుకుంటూ ఈమె నెలాగయినా కవ్వించాలి అనుకున్నాడు. కాని, ఎలా? ఏదో ఆలోచించి మెల్లిగా ఆమె దగ్గరికి నడిచి:

"మిస్ ..." అని నవ్వాడు.

"మిసెస్ ఆర్. ఉపేన్" అని తన పూర్తిపేరు చెప్పి ఆమె నవ్వింది.

"మిసెస్ ఉపేన్! మీతో కొంచెం మాట్లాడాలి."

"ఓ. కే. మీ రీ హోటల్లోనే గదూ ఉండేదీ. నేను తిని తర్వాత మీరూం వైపు వస్తాలెండి" అని మళ్ళీ తినటం మొదలెట్టింది.

"నేను ఇక్కడే ఆరో నంబరు గదిలో ఉంటున్నా నండీ. తప్పకుండా వస్తారు గదూ?" అని మర్యాద కని ఆమె ముందు రవంత వంగి, తన గది చేరు కున్నాడు.

గదిలో సిగరెట్ వెలిగించి ఆ ఉత్తరాన్ని మళ్ళీ చదివి—ఎవరీ రతి? వెర్రిబాగుల్ది కాదుగదా? అయితే భర్తకు అర్థం, పరమార్థం చెబుతూందేమిటి? పోనీ మహాజ్ఞానా? అయితే భర్త తాగుడు మాని పించడం పోయి, అతనికి డబ్బు పంపుతూ ప్రోత్స హిస్తుం దేమిటి? ఇలా ఆలోచిస్తుంటే తలుపు చప్పుడయింది. అతను—"కమిన్ ప్లీజ్" అని ఆమె కో కుర్చీ చూపించి, "డ్రింక్స్?" అని ఆమెవైపు చూచాడు.

"ఈవేళప్పుడా! అయినా ఇప్పుడేగా భోంచేసింది?"

"ఫర్వాలేదు. కొద్దిగా తీసుకుంటే సరి" అని విస్కీ బాటిల్, సోడాసీసాలు తీసి రెండు గ్లాసుల్ని నింపి, ఒక టామె కందిస్తూ, "సారీ...నో ఐస్" అనంటే,

ఆమె—"ఇట్సాల్‌రైట్" అని, గ్లాసు నందుకుని "ఏమిటీ ఏదో మాట్లాడా లన్నారు?" అనడిగింది.

"ఏం లేదు, నా కిప్పు డో సమస్య వచ్చింది.

దానికి మీ సలహా అవసరం.''

తన సలహా కావాలంటూనే ఆమెలో ఎక్కడలేని ఉత్సాహం కనిపించింది. తన కళ్ళని టపటపలాడిస్తూ "ఏమిటది?'' అంది.

ఆ ఉత్తరాన్ని ఆమె కందిస్తూ, తన కిది విమానంలో దొరికిన సంగతి చెప్పి: "ఈ రతీదేవి ఎవరో మీకు తెలుసేమోని ...'' అడిగాడు.

ఆమె ఆ ఉత్తరాన్ని ఒక క్షణం చూసి:

"ఓహ్... దిస్ రతి! ఈమె నాకు బాగా తెలుసండీ. బొంబాయిలో ఉంటోం దిప్పుడు. కాని, తెలుసుకుని ఏం చేస్తారు?'' అని అడిగింది.

దాని కతను ఆశ్చర్యపోయి 'తెలుసుండదని తను అనుకుంటే రతి తనకు తెలుసు నంటుందేమిటీవిడ?' అని అనుకుని, పైకి మాత్రం: "గుడ్. అయితే నా సమస్య తీరిందన్నమాటే. దయచేసి ఆమె అడ్రెస్ నా కోసారి ఇవ్వండి. ఈ చెక్కును ఆమెకు తిప్పిపంపాలి'' అన్నారు.

"హో. దానికేం లెండి. సాయంత్రం ఇటొచ్చి నప్పుడు తెస్తా. అన్నట్టు ఇది క్రాస్ చెక్కే కదా. తిప్పిపంపకపోతేనేం? ఈ ఉత్తరంతోపాటు చెక్కునీ చింపి పడేసి ఏమీ జరగనట్టు ఉండకూడదూ?''

"భలేవారే. ఎంత క్రాస్ చేసినా, పాతికవేలచెక్కు పోయిందంటే ఎవరికయినా బాధే కదండీ.''

"అవుననుకోండి. అయినా, ఈ చెక్కు నాకే దొరికుంటే, వీలయితే దీన్ని మార్చుకుంటాను. లేదా చించి అవతల పడేసుందును.''

"అలా అని నమ్మమంటారా? ఏదో తమాషాగా అన్నారే కానీ, మీ రలా ఎన్నటికీ చెయ్యరని నాకు తెలుసు. అన్నట్టు మీకు తెలీదేమో. నాకు మైండ్ రీడింగ్ బాగా తెలుసునండోయ్'' అని నరేన్ అదోలా మొహం పెట్టి చిలిపిగా అంటే— ఆమె నవ్వాపుకోలేక కిలకిలా నవ్వింది. అతనూ నవ్వాడు. ఇలా ఖబుర్లాడుతూ, ఇద్దరూ ఆ విస్కీ సీసాను గంటలో ఖాళీ చేశారు.

ఆమె లేస్తూ, "నే నిక వెళ్ళాలి, నరేన్. మిమ్మల్ని కలుసుకున్నందుకు నా కెంతో సంతోషంగా ఉంది. మీ తమాషా మాటలతో కాల మిట్టే గడిచి పోతుంది'' అనంటే...

అతను—"నాకూ అలానే ఉంది. మీ లాంటి అందమైన ఆడవాళ్ళు ఇలా ఖులాసాగా మాటాడుతూంటే, యుగాలయినా క్షణాల్లో గడుస్తాయి. మీ సాహచర్యం అలాంటిది మరి. అన్నట్టు సాయంత్రం ఇటు రావటం. మరవకండేం. వస్తూ రతి అడ్రసు పట్టండి'' అని ఆమె వెంట గుమ్మం దాకా నడిచాడు. బయటికి అడుగు వేసే ముందు ఆమె వెనుదిరిగి తన వెడల్పాడి నల్లని కళ్ళతో అత న్నోసారి చూచి చిరునవ్వు నవ్వింది. అప్పుడు అత నామెను అమాంతం తన చేతుల్లోకి తీసుకో బోతూంటే టెలిఫోన్ మోగింది.

"డామిట్'' అని అతను ఫోన్ వైపు వెడితే, ఆమె బయటికి నడిచింది.

తరవాత చాలా సేపు దాకా ఆమె గురించే ఆలోచించాడు నరేన్. ఇంత నాగరికత, చదువు, సంస్కారం ఉన్న యువతి భార్యగా లభించటం ఏ మగాడికైనా ఒక వరం. కాని తన భార్య ఎం. ఏ. చదివినా, ఆమెలో ఎలాంటి సంస్కారం లేదు. అస్తమానం ఇతర్లని దూషించటం, అందరితోనూ పోట్లాట్టం, తనకు లేని రోగాల్ని వూహించుకుని త నేమైపోయినా ఎవరూ పట్టించుకోరని బాధ పడటం...ఇలా తనకూ, తన వాళ్ళకూ ఏ మాత్రం మనశ్శాంతి లేకుండా చేయటం ఆమె తత్వం. ఇవన్నీ మరిచి ఆమె ఏ నాడయినా తన దగ్గర కొచ్చినా, ఆ రాత్రి ఏదో మొక్కుబడి తీర్చుకున్నట్టుగా ఉంటుంది. అందుకే తనా సుఖాల్ని బయట వెతుక్కుంటూ ఉంటాడు. ప్రయోజనం లేని అతని రసికత్వం, అసభ్య నాగ్గరికత లోని కుళ్ళుతో కలిసి పోతూ ఉంటుంది. అయినా అతను తన చిన్న ప్రపంచంలో లేని రంగుల్ని సృష్టించుకుని తృప్తి పడుతూ ఉంటాడు.

ఆసాయంత్రం నరేన్ తన రూంలో కూచుని విస్కీ తాగుతూంటే లైట్లారి పొయ్యాయి. లేచి తలుపు తీసి, మళ్ళీ వచ్చి కూచుంటూనే లైట్లు వెలిగాయి. విస్కీలో సోడా కలుపుతూంటే ఎవరో ఇటొస్తూన్న శబ్దం. పోర్టికోలోకి చూస్తే మిసెస్ ఉపేన్. ఆమె తన గదికే వస్తూందని అత ననుకున్నా, ఆమె

చాకబారు బ్రాండుకు వెళ్ళకండి
అత్యుత్తమ నాణ్యతను పొందండి
ఎలక్ట్రానిక్స్‌లో అద్భుతం




ఫిజి నేషనల్ ఆల్‌వరల్ ట్రాన్సిస్టర్. "మ్యాజిక్‌లైట్ మాడల్ ఎల్—82తో టూ ఇన్ వన్ టైపు'' అమ్మకం పన్ను, ఉచిత బంగారం చేతి గడియారం గొలుసు పోస్టేజి మరియు 2 సంవత్సరాల గ్యారంటీతోపాటు రూ. 165/—టోకు అమ్మకం ధరకు మీ స్వంతం కాగలదు. 30 రోజుల్లోపల ఆమోదించ బడకపోతే పైకం వాపసు చేయబడుతుంది.

H. M. TRADINGS (W-6)
Nirmalpuri, Delhi-110024.

సరిక్రొత్త శక్తి యవ్వనమునకు
సంప్రదించండి



నరముల బలహీనత, గుప్త రోగములు, చర్మ వ్యాధులు, మొలలు, సెక్స్ బలహీనతలకు ఉత్తమ చికిత్స చేయబడును. సంపూర్ణ ఆరోగ్యము సుఖ దాంపత్య జీవితమునకు పెండ్లి ముందు పెండ్లి తర్వాత సంప్రదించండి.

Dr. Z. H. ROY (Govt. Regd.)
Dr. K. KESAVA RAO
(Ayurveda Praveena)

ఆసియా క్లినిక్
సంధ్యటాకీసు ఎదుట, R.T.C. X ROADS
హైద్రాబాద్-500 020 (ఆం. ప్ర.)
బ్రాంచి : నటరాజ్ టాకీస్ ఎదుట,
విజామాబాద్.

ఆ గదిని దాటి ముందుకు పోతూంది.

"మిసెస్ ఉపేన్!" పిలిచాడు.

ఆమె తిరిగొచ్చి—"ఓహ్, నరేన్! నేను మరిచే పొయ్యాను. ఇదిగోనండీ మీ రడిగిన అడ్రసు" అని పర్సులోంచి ఒక కాగితం తీసి ఇచ్చింది. అతను దా న్నందుకుని, ఆమె కో కుర్చీ చూపించి, విస్కీ సీసాతోపాటు ఒక గ్లాసుని ఆమె ముందుంచి—"కానివ్వండి" అన్నాడు.

గ్లాసులో విస్కీ కలుపుతూ—"మీరు నన్ను మరీ మొహమాట పెట్టేస్తున్నారు. ఈ మీ అతిథి మర్యాదలకు నేను ఉక్కిరి బిక్కిరై పోతున్నా నంటే నమ్మండి" అంటే అతను

"భలేవారే. మీ స్నేహంతో ఇక్కడి నా వంటరి తనం మటు మాయ మైతే! మీ సహచర్యం నా చుట్టూ సువాసన్లని విరజిమ్మినట్టు ఉందంటే నమ్మండి" అన్నాడు.

ఆ మాటలకి ఆమె కళ్ళు మిల మిల మెరిసి, టపటప లాడాయి. ఉత్సాహంగా ఇంకో గ్లాసు కలుపుతూ—"అబ్బో. మీకు కవిత్వంకూడా వచ్చే! అన్నట్టు, మీ మకాం ఇక్కడెన్ని రోజులూ?"

"రేపు ఉదయం ఫ్లయిట్‌కు మద్రాసు వెడు తున్నా."

"నేనూ రేపు ఢిల్లీ వెడుతున్నా. ఒక పది నిమి షాల తేడాతో మనిద్దరం ఈ హైదరాబాదు విడిచి వెడుతున్నా మన్నమాట."


ఇలా ఖులాసాగా ఖబుర్లు చెప్పుకుంటూ గ్లాసు తరవాత గ్లాసు ఖాళీ చేసేస్తున్నారు. అతిగా తాగి హుషారుగా మాటాడుతూన్న మిసెస్ ఉపేన్ ఉన్నట్టుండి ఒక్కసారి గంభీరంగా మారిపోయింది. అతి కష్టం మీద పెదాల్ని పెగిల్చి.

"మిస్టర్ నరేన్! మీ కెవరైనా ఒక గర్ల్ ఫ్రెండుందా?" అనడిగితే—అనుకోని ఈ ప్రశ్నకి ఆశ్చర్యపోయా డతను. మాటాడకుండా తల అడ్డంగా తిప్పేడు.

"గుడ్‌బాయ్! అదే ఆ వెధవ చూడు...అస్తమానం దాని చుట్టూ తిరుగుతూంటాడు."

"నా కేమీ అర్థం కావటం లేదు. ఎవ రా వెధవ? ఎవరి..."

"అదే ఆ ఉపేన్. నన్ను పెళ్ళి చేసుకుని, మోజు తీరాక ఇప్పుడు దాని చుట్టూ తిరుగుతున్నాడు. ఈ మోజు ఎన్ని రోజులు."



ఆమెకు మత్తెక్కుతోందని తెలుస్తూనే ఉంది. స్పృహ కూడా తప్పుతున్నట్టుంటే "మిసెస్ ఉపేన్" అని ఆమెను కదిపి, లేపి, ఒక గ్లాసెడు చల్లని మంచి నీళ్ళు తాపి తర్వాత ఒక కప్పు వేడి వేడి కాఫీ ఇచ్చి, మొహం కడుక్కురమ్మని బాత్‌రూంలోకి పంపాడు. ఆమె ఒక రెండు నిమిషాల తర్వాత తిరిగొచ్చి మొహం తుడుచుకుంటూ నవ్వి—

"నరేన్! ఇంతవరకూ మీ గురించి ఒక్క ముక్క అయినా చెప్పేరా? చెప్పండి—మీ గురించి, మీ ఆవిడ గురించి..."

"హో హో... ఆగండి. ఆమె పేరెత్తితే ఇప్పుడామె వెయ్యి మైళ్ళ దూరాన ఉన్నా, అక్కణ్ణుంచే దెబ్బ లాడుతుంది మీతో!"

ఆమె దానికి కిల కిలా నవ్వి—"భలే తమాషాగా మాటాడతారే. ఏం ఎందుకు దెబ్బలాడుతుందీ?" అనడిగింది.

"అది ఆమె తత్త్వం."

"ఒక్క నాతోనేనా లేక మీతోనూడానా?"

"అందరితోనూ. నాతో అయితే ఇంకా ఎక్కువే! పగలూ—రాత్రి, ఇంటా—బయటా, వంటింట్లో—పడకటింట్లో... ఒకచోటేమిటి?"

"బెడ్రూంలోనూనా? మరి మీ అవసరాలు?"

"డబ్బిచ్చి బయట తీర్చుకుంటున్నా."

"తమాషాగా ఉందే!" అనంటూంటే మళ్ళీ లైట్లు ఆరిపొయ్యాయి. ఆ చీకట్లో కొంత సేపు ఎవరూ మాట్లాడలా. కొన్ని క్షణాలలో తర్వాత—

"మిసెస్ ఉపేన్! ఈ చీకట్లో నేను మిమ్మల్ని ఏమైనా చెప్తే ఏం చేస్తారు?" అన్నాడు నరేన్.

అన్నాడేగాని, తన ఈ చిలిపి మాటలకి ఆమె రభస చేస్తుందేమోనని భయపడిపోయాడు. కాని, ఆమె ఏమీ అనలా. కొన్ని క్షణాల తర్వాత నిబ్బరంగా—

"ఏ ఆడదైనా ఏం చేస్తుంది? కేకలేసి అల్లరి పెడుతుంది."

"అంటే..."

"నే నన్నమాటల్లో రెండర్థాల్లేవు." అనంటూంటే లైట్లు వెలిగాయి.

"హమ్మయ్య!" అని అతనంటే—

"నేనిక వెడతాను, నరేన్! అర్థ రాత్రి దాటి పట్టింది" అంటూ ఆమె లేచింది.

అతను— "మిసెస్ ఉపేన్! మీ ఆయన అదృష్టవంతుడు..."

ఆమె అదోలా నవ్వి, "గుడ్‌నైట్" అని బయటికి నడిచి చీకటి తెరల్లో కలిసిపోయింది.

ఆ తెరలు కరిగి తెల తెల వారుతూంటే, నరేన్ ప్రయాణానికి సర్దుకుంటున్నాడు. సర్దుకుంటూ ఆమె గురించే ఆలోచించాడు. క్రితం రాత్రి త నడిగిన ప్రశ్నకు ఆమె డొంకతిరుగుడు సమాధాన మిచ్చిందే గాని, సూటిగా తనేం చేసేది చెప్పలేదు. ఎంత లౌక్యం! అలా నా ఒకందుకు అతనికి సంతోషంగా ఉంది. ఏమంటే, త నామెలో మొదటి రోజు చూచిన బింకంతో కూడిన నిర్లక్ష్యం ఇప్పుడు మచ్చుకైనా కనిపించటం లేదు!

ఇలా ఆలోచిస్తూ బాగేజీ సర్దుకుని విమా నాశ్రయం చేరుకున్నాడు. అప్పటికే అక్కడున్న



సూర్యనారాయణమూర్తి నిజరూపం (హర్షవల్లి)

ఆమెను చూచి 'హాయ్' అని చెయ్యూపాడు. ఆమె 'హాయ్' అని హాయిగా నవ్వింది. క్రితం రాత్రి విస్కీ హాంగోవర్‌తో పాటు ఇప్పటి ఆమె అందం కవ్విస్తూంటే పిచ్చెక్కుతోం దతనికి. ప్లేన్‌కి టైము నవటంతో ఆమెను తప్పించుకుని, బాగేజీ తూకం వేయించి, సెక్యూరిటీ గది ముందున్న క్యూలో కలిసిపొయ్యాడు. కాని మళ్ళీ క్యూలోంచి తప్పుకుని ఆమె దగ్గర కొచ్చి—

"మిసెస్ ఉపేన్! మీతో కలిసి కాఫీ తాగాల నుందండీ"

ఆమె—"ఓ. దానికేముండీ. పదండి" అని కాంటీన్ వైపు నడిచింది. కౌంటరు ముందు ఇద్దరూ కాఫీ తాగుతూంటే, నరేన్ ఏదో అనాలను కుని—

"నేను ... మిమ్మల్ని ... యూ ఆర్ ..." అని నసిగితే ఆమె నవ్వి—"వూ ...?" అంది.

ఇంతలో మద్రాసు వెళ్ళే విమానం కొన్ని క్షణాల్లో బయలుదేరబోతోంది" అని లౌడ్‌స్పీకర్లో వినిపించింది.

నరేన్—"డామిట్" అని విసుక్కుని, "గుడ్ బై మిసెస్ ఉపేన్" అని మళ్ళీ, "ఐ లవ్ యూ" అనేసి వెనక్కి తిరిగాడు.

ఆమె—"జస్ట్ ఎ మినిట్" అన్నా వినిపించుకో కుండా సెక్యూరిటీ రూంలోకి పరుగెత్తాడు. అక్క ణ్ణుంచి టార్ మేక్ మీద కుడివైపున్న విమానం వైపు వెడుతుంటే, మలుపు దగ్గర ఆమె నిల్చి నుంది.

"నరేన్!" అని సున్నితంగా పిల్చింది.

ఆలస్యమైపోతున్నా అతను ఆగాడు, ఆమె అతనికి కవర్ని అందిస్తే దాన్ని మడిచి జేబులో పెట్టుకుని, కొంటెగా నవ్వుతూ "ఐ లాస్ట్ ..." అని వినిపించీ వినిపించనట్టు ఏదో అంటే ఆమె సున్నితంగా—



"షటప్" అని సిగ్గుపడిపోయింది.

ఆ పక్కనే యూనిఫారంలో ఉన్న ఎయిర్‌పోర్టు మనిషి—"హరియప్ ప్లీజ్" అని తొందరించాడు.

నరేన్ ఆమెకు బై బై చెప్పి 'ఈమే నా భార్య అయుంటే ఎంత బాగుండును!' అనుకుంటూ విమాన మెక్కాడు.

ఆకాశంలో విమానం దూసుకుపోతుంటే ఆమె అందించిన ఉత్తరం తీసి చదవటం మొదలెట్టాడు.

"మిస్టర్ నరేన్!

మీ గురించి కొన్ని విషయాలు చెప్పాలనుంది. మిమ్మల్ని చూసింతర్వాత నా కేమనిపించిందో తెలుసా? జీవితంలో ఎన్నో ఉన్నా, ఇంకెన్నో అందబోతూన్నా, వాట్ని అంది పుచ్చుకుని అనుభవించే ధైర్యం లేని మీలాంటి వాళ్ళూ ఈ ప్రపంచంలో ఉన్నారని! ఆశించినది అంది, అనుకోకుండా అది జారిపోతే, ఉస్సురంటూ జీవితం సాగించే నా లాంటి వాళ్ళు మిమ్మల్ని చూసి పూరట చెందటం తప్ప చెయ్య గలిగిం దేమీ లేదు. జాలిపడటం అప్రస్తుతం.

అన్నీ ఉండి, ఏమీ లేనట్టు మీరు నిస్పృహ పడుతూంటే, ఏమీ లేని నేను మీకంటే సుఖంగానే జీవిస్తున్నాను! మీ క చిన్న సలహా. ఇక ముందు మీరు నో స్త్రీతో ఒంటరిగా ఉన్నప్పుడు లైట్లారి పోతే, నన్ను అడిగిన చచ్చు ప్రశ్నని ఆమెను అడ క్కండి — ముఖ్యంగా అంత క్రితం మీరు చేయ బోయిన సాహసానికి ఆమె అభ్యంతరం తెలుపకుంటే. ఆ సాహసం వల్లే మీ ప్రశ్న చచ్చుప్రశ్న అయింది. ఈ చచ్చు ప్రశ్నే మీ మైండ్ రీడింగ్ బుకాయిం పుని బయట పెట్టేసింది. ఇంకో మాట. అది నే నూహించిన మీ మనసులోని మాట. ఎదుటి స్త్రీ వచ్చి మీ మీద వాలాలని మీ కోరిక. అవునా? కాని, అలా ఎన్నటికీ జరగదు. ఏ ఆడదైనా, ఎప్పుడూ తన స్త్రీత్వపు విలువల్ని కాపాడుకుంటూనే ఉంటుంది. అలా కానినాడు, ఆ విలువలు మారి, మీ మగాళ్ళ రసికత్వంలోని అందం, ఆనందం హరించిపోతాయి.

ఇక నా గురించి—నేను ఉపేన్‌ని ప్రేమించి పెళ్ళా డాను కాని, ఇప్పుడతను నా స్నేహితురాలి ప్రియుడు. కాని, అతనంటే నాకు ఇప్పటికీ, ఎప్పటికీ ప్రేమే!

ఆఖరి మాట: మీకు విమానంలో దొరికిన చెక్కుని నేను మీ కిచ్చిన చిరునామాకు కాక, ఇందులో ఉన్న ఉపేన్ అడ్రసుకే పంపండి. అతను దాన్ని పెళ్ళాడటానికి ఈ డబ్బు అక్కరొస్తుంది.

—మిసెస్ రతీ ఉపేంద్రనాద్."

ఉత్తరం చివర్న ఉన్న పేరు చూసి మతిపోయిం దతనికి. ఆమె చెప్పిన నిజాలకు అతని వూహల్లోని రంగులు కరిగిపొయ్యాయి. పైకి కనిపించే ఆమె ఆకారానికీ, కనిపించని వ్యక్తిత్వానికీ పోలికే లేదు. అయినా, తనను ఎంత బాగా అర్థం చేసుకుంది! తన మనస్సుని అంత బాగా అర్థం చేసుకున్న ఆమె సామర్థ్యానికి ఆమె ముందు తనెంతో చిన్నవాడై పోయినట్టనిపించింది. ఆమె వ్యక్తిత్వం ముందు త నొక క్షణం నిలవలే ననిపించింది.

ఇంకొకసారి ఆమె తన క్కనిపిస్తే తప్పించుకు తిరగాలనిపించింది. *